

కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభం



వైద్యులు, సిబ్బందితో డిఎంహెచ్‌ఒ కొండయ్య

ప్రజాశక్తి-పీలేరు : మనుషుల్లో కేన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే దాన్ని చికిత్స ద్వారా నయం చేయడం సులభమని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. శనివారం పీలేరు ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందికి కేన్సర్ వ్యాధి నివారణపై జరిగిన అవగాహన, శిక్షణా తరగతులను డాక్టర్ కొండయ్య, పీలేరు ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ పర్యవేక్షించారు. శిక్షణ ఇస్తున్న అధికారులకు, శిక్షణ తీసుకుంటున్న వైద్యులు, సిహెచ్‌ఒలు క్రమశిక్షణతో శిక్షణ పొంది, మంచి అవగాహనతో ప్రజల్లోకి వెళ్లి భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కేన్సర్ వ్యాధిని ప్రాథమికదశలోనే గుర్తించి వైద్య సహాయం తీసుకుంటే పూర్తిగా నయం చేయవచ్చని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీలేరు ఆసుపత్రి వైద్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిహెచ్‌ఒ లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్/రాయచోటి/రామాపురం

ఉమ్మడి కడప జిల్లాతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మొదటి సారి ఎమ్మెల్యే గెలిపించిన రాయచోటి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, ఆ ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటుపడతానని తెలిపారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సొంత నియోజకవర్గం రాయచోటి వెళుతూ శనివారం మార్గమధ్యంలో కడప విజయదుర్గ ఆలయాన్ని సందర్శించారు. తొలిసారిగా మంత్రి పదవిని చేపట్టిన ఆయనకు ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలో ఇప్పటికే ఉచిత ప్రయాణం అమలవుతోందన్నారు. మరింత లోతుగా అధ్యయనం చేసి పొరపాట్లకు తావు లేకుండా రాష్ట్రంలో ప్రవేశపెడతామన్నారు. వెలకట్టలేని ఎంతో అభిమానంతో రాయచోటి నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనపై నమ్మకం, విశ్వాసంతో మంత్రి పదవిని కట్టబెట్టారన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని, ప్రజల అభిమానం, విశ్వాసాన్ని రెట్టింపు చేసేలా మంత్రిగా తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల కోసం చేసే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి ఆ దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా అందుతాయనే విశ్వాసాన్ని వెళ్లబుచ్చారు.



రామాపురం వద్ద మంత్రి గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు



మంత్రి దంపతులకు వస్త్రాలు అందజేస్తున్న దుర్గాప్రసాద్ దంపతులు

ముఖ్యమంత్రి సహకారంతో రవాణా, యువజన, క్రీడా శాఖలలో వినూత్నమైన మార్పును తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ముఠా దోపిడీ చేసిన ప్రజాధనాన్ని వడ్డీతో సహా కక్కిస్తామన్నారు. రాష్ట్రాన్ని ఆ పార్టీ నేతలు దోచుకున్నారని విమర్శించారు. వారు ఎక్కడ దాచినా బయటికి తీసుకొస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా ముందుకు వెళ్లడమే తన ఏకైన లక్ష్యమని పేర్కొన్నారు. కడపకు విచ్చేసిన మంత్రికి ప్రజలు విశేష సంఖ్యలో రోడ్డు ఇరువైపులా బారులు తీరి పూలు, బాణాసంచాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వాహకులు దుర్గాప్రసాద్, ఆయన సతీమణి మంత్రి దంపతులకు అమ్మవారి వస్త్రాలను అందజేశారు.

'మండిపల్లి'కి అడుగడుగునా నీరాజనం

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా రాయచోటికి వచ్చిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గువ్వలచెరువు ఘాట్ దగ్గర నుంచి ప్రజలు విశేష సంఖ్యలో రోడ్డు ఇరువైపులా బారులు తీరి మంత్రికి ఘన స్వాగతం పలికారు. గువ్వల చెరువులో క్రేన్ ద్వారా భారీ గజమాలతో ప్రజలు స్వాగతించారు. పెద్ద సంఖ్యలో జనం హాజరై డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో గువ్వల చెరువు, కొత్తరోడ్డు, నారాయణపురం, నీలకంఠరావుపేట, రామాపురం, గంగనేరు, కొండవాండ్లపల్లె, చిట్లూరు, బండపల్లె, బిట్స్ కళాశాల, రింగ్ రోడ్డు, మీదుగా రాయచోటి పట్టణంలో భారీ ర్యాలీ ద్వారా మంత్రి పార్టీ కార్యాలయం చేరుకున్నారు. రామాపురం ప్రజలు రెండు భారీ క్రైన్‌ల ద్వారా గజమాలతో మంత్రికి స్వాగతం పలికారు. రోడ్డు కిరువైపులా ప్రజలు ఊరూరా నిలబడి బొకేలు, పూలమాలతో మంత్రికి స్వాగతం పలుకుగా ప్రతి ఒక్కరినీ మంత్రి చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేస్తూ పేరుపేరునా పలకరిస్తూ ప్రజలకు అభివాదం చేశారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నియోజకవర్గంలో పనిచేస్తున్న అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే షాజహాన్ బాషా హెచ్చరించారు. శనివారం పట్టణంలోని స్థానిక ఎన్‌విఆర్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బికెపల్లి, కోళ్ల బైలు పంచాయతీలతో పాటు అమ్మచెరువుమిట్టలో ఇటీవల కాలంలో అక్రమణలు ఎక్కువయ్యాయని, ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసి ఇల్లు నిర్మించారని, వీటిని ఎటువంటి పరిస్థితుల్లో ఉపేక్షించబోయే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. నియోజకవర్గ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ సమీక్షలో మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారులు దోచేస్తున్నా అధికారులు ఎలా చూస్తూ ఉండిపోయారని ప్రశ్నించారు. వెంటనే తహశీల్దారు, హౌసింగ్ అధికారులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది వెళ్లి ఎవరైతే పట్టాలు లేకపోయినా అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారో వాటిని వెంటనే కూల్చివేయాలని, ఇన్ని రోజులు విధుల్లో అలసత్వం వహించిన అధికారులపై సస్పెన్షన్ వేటు వేయాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలో ఏడాది లోపు 50 వేల మొక్కలను నాటాలని నిర్ణయించారు. ఇందుకు సచివాలయ ఉద్యోగులు ప్రతి శాఖలోని ఉద్యోగులు ఆదివారం ఉదయం ఆరున్నర గంటల నుంచి 9.30 గంటల వరకు ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని, వాటిని వెంటనే సరి చేయాలని తెలిపారు. హంద్రీ-నీవా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో అన్ని వస్తువులు కల్పించాలని, టీచర్ల లోటు లేకుండా సమీక్ష చేయాలన్నారు. అంతేకాకుండా అంగన్వాడీలలో న్యూట్రిషన్ ఫుడ్ చాలా మందికి అందడం లేదని వాటిపైన స్పెషల్ ఫోకస్ పెడతామన్నారు. రోడ్లు భవనాలు అగ్రికల్చర్, ఆర్డబ్ల్యూఎస్, తదితర అన్ని శాఖల పైన ఎమ్మెల్యే సమీక్ష చేసి తగిన సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు కొన్ని హెచ్చరికలు కూడా చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహశీల్దార్ రమాదేవి, డ్వామా అధికారి మీనా కుమారి, మూడు మండలాల తహశీల్దారులు, ఎంపిడిఒలు, సూపర్‌వైజర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధ్యాపక బృందం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు ఉన్నతస్థానాలను అధిరోహించాలంటే క్రమశిక్షణ, సమయపాలన, సమాజంపట్ల బాధ్యత, అంకితభావం కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బోయినపల్లెలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 2024 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన బిటెక్ విద్యార్థులకు పట్టాల ప్రధానోత్సవ కార్యక్రమం (గ్రాడ్యుయేషన్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఎన్‌టియు అనంతపురం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్.శ్రీనివాసరావ, యూనివర్సిటీ నామినీగా డాక్టర్ జి.వెంకట నగేష్ కుమార్, జెఎన్‌టియు పులివెందుల వారు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల సాధించిన విజయాలు పట్ల తమ హర్షం వెల్లబుచ్చుతూ విద్యార్థులకు మంచి విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించడం ఎంతో గొప్ప విషయమని తెలియజేశారు. అన్నమాచార్య కళాశాల అత్యుత్తమ విద్యా ప్రయోగాలు నెలకొల్పి విద్యార్థులను నిర్దేశిత లక్ష్య సాధనలో మేటిగా నిలుస్తుందని కొనియాడారు. అనంతరం 930 మంది విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సామాజిక అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులందరూ ఎప్పటికప్పుడు జ్ఞానాన్ని పంచుకోవడంలో ముందుండాలని, అప్పుడే మరిన్ని కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో విలువలు, వైఖరిని బట్టి భవిష్యత్తు నిర్ణయించబడుతుందని తెలియజేశారు. విద్యార్థులకు భవిష్యత్తులో అపజయాలు ఎదురైనప్పుడు ధైర్యం కోల్పోకుండా ముందుకు నడవాలని సూచించారు. అన్నమాచార్య విద్యా సంస్థలు అందిస్తున్న సదుపాయాలను వివరించారు. అనంతరం విద్యార్థులు తాము అభ్యసించిన విద్యను దేశాభివృద్ధికి అంకితం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.మారుతీ ప్రసాద్, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఎన్.రంగనాథమ్ వారి బృందం, డీన్స్ డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు, డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ డి.కృష్ణమోహన్ రాజు, డాక్టర్ ఎన్.శివరామిరెడ్డి, వివిధ విభాగాల విభాగాధిపతులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కడపలో సినీ నటి నిధి అగర్వాల్ సందడి

ఎమ్మెల్యే మాధవితో కలిసి జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం



జోస్ ఆలుక్కాస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న నిధి అగర్వాల్, ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో సినీనటి, ప్రముఖ హీరోయిన్ నిధి అగర్వాల్ సందడి చేశారు. కడప ఎమ్మెల్యే మాధవితో కలిసి జోస్ ఆలుక్కాస్ నగల షోరూమ్‌ను ప్రారంభించారు. ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జోష్ ఆలుక్కాస్ బంగారు, వజ్రాల షోరూమ్‌ను శనివారం కడప ఎమ్మెల్యే మాధవి, సినీనటి నిధి అగర్వాల్ ప్రారంభించారు. సినీ నటిని చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున షో రూమ్ వద్దకు చేరుకున్నారు. అభిమానులను ఆమె ఆప్యాయతగా పలకరించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. బంగారు, వజ్రాభరణాలను ప్రదర్శించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కడపలో కార్పొరేట్ షో రూములు రావడం సంతోషంగా ఉందన్నారు. వ్యాపారం అభివృద్ధి చెంది మరిన్ని షోరూమ్ లు ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. సినీనటి మాట్లాడుతూ మొదటిసారి కడపకు వచ్చానని తెలిపారు. ప్రజల ఆదరణ మరువలేనని పేర్కొన్నారు. నాణ్యతకు, మన్నికకు పెట్టింది పేరు జోస్ ఆలుక్కాస్ అని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ వర్గీస్ ఆలుక్కా, పాల్ ఆలుక్కా, జాన్ ఆలుక్కాస్ మాట్లాడుతూ షోరూం ప్రారంభం సందర్భంగా రూ.60 వేలు విలువ గల బంగారు ఆభరణాలు వజ్రాల కొనుగోలుపై బంగారు నాణ్యాన్ని అందుకుంటారని, వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై ఏడు శాతం తగ్గింపు వినియోగదారులకు అందిస్తున్నామని చెప్పారు. బంగారు ఆభరణాల తరుగు ఛార్జీలపై 50శాతం తగ్గింపు కూడా ఉందని పేర్కొన్నారు. వివాహ కొనుగోళ్లపై ప్రత్యేక డిస్కౌంట్ లభిస్తాయని తెలిపారు. పాత బంగారానికి ఎక్చ్సేంజ్ చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో తన ఉనికిని పటిష్టం చేసుకుంటుందని చెప్పారు.

బక్రీద్ ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

ప్రజాశక్తి-రాయచోటి

సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ వాసు బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో బండ్ల పెంట, ఫ్రూట్స్ మండీ, మార్కెట్‌లలో ఏర్పాటు చేసిన తాత్కాలిక జంతు వధ శాలల వద్ద శానిటేషన్, నీటి సరఫరాలో లోపాలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్,శానిటేషన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ మంచి వాతావరణంలో పండుగ నిర్వహణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, ఫీస్ కమిటీ, మత పెద్దల సూచనల మేరకు పట్టణంలోని బండ్ల పెంట, ఫ్రూట్స్ మండి , మార్కెట్ యార్డ్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాత్కాలిక జంతు వధ శాలలు ఏర్పాటు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమీక్షలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** ప్రశాంత వాతావరణంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను జరుపుకోవాలని పీలేరు అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం సిఐ కార్యాలయంలో ముస్లీం జమాత్, కమిటీ మత పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో పీలేరు పట్టణానికి చెందిన అన్ని మసీదుల ముతవల్లీలు, జమాత్ పెద్దలు, ఎస్‌ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రూరల్ సిఐ రవీంద్రనాథ్ తెలిపారు. అన్ని మతాలవారితో సమావేశం నిర్వహించారు.



పీలేరులో ఎంఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి నాయకులు

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో నిబంధనలకు విరుద్ధంగా సిబిఎస్‌ఈ పేరుతో అడ్మిషన్స్ చేస్తున్న తపస్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీలేరు మండల విద్యాశాఖ అధికారికి శనివారం ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఇ) గుర్తింపు లేకపోయినా తపస్య పాఠశాల నిర్వాహకులు సిబిఎస్‌ఇ ఈ స్కూల్ సిబిఎస్‌ఇ పేరుతో అడ్మిషన్లు చేపట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతోందని ఆరోపించారు. సిబిఎస్‌ఇ అఫిలియేషన్‌కు సంబంధించిన తప్పుడు వాదనతో తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించి విపరీతమైన ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ తప్పుడు సమాచారం తల్లిదండ్రులను మోసం చేయడమే కాకుండా ఈ సంస్థలో చేరిన విద్యార్థుల భవిష్యత్తును కూడా ప్రమాదంలో పడేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తపస్య స్కూల్‌పై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యుఐ తరపున డిమాండ్ చేశారు. తపస్య సిబిఎస్‌ఇ స్కూల్ కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపించి పాఠశాల అనధికార స్థితి గురించి తల్లిదండ్రులకు తెలియజేయడానికి పబ్లిక్ నోటీసును జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యా నియమాలు, నిబంధనలను ఉల్లంఘించినందుకు పాఠశాల నిర్వహణపై అవసరమైన చట్టపరమైన, పరిపాలనా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని కోరారు. బాధిత తల్లిదండ్రుల నుంచి వసూలు చేసిన అధిక ఫీజు రీఫండ్ చేయించాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణం స్పందించలేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, ఇమ్రాన్, అఖిల్, కుమార్ పాల్గొన్నారు.

బోయలకే చైర్మన్ పదవి ఇవ్వాలి : విఆర్‌ఎస్‌ఎస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : బోయల నామకరణంతో పిలవబడుతున్న ప్రఖ్యాత బోయకొండ అమ్మ వారి ఆలయ కమిటి నిర్వహణ బాధ్యతలు మాత్రం ఇంతవరకు తమ సామాజిక వర్గానికి ఇవ్వకపోవడం అత్యంత దారుణమని విఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లి మండలంలో వెలసి, ఎంతో ప్రాశస్త్యం కల్గిన బోయకొండ గంగమ్మ దర్శనం కోసం మూడు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటాని పేర్కొన్నారు. ఇక్కడ మొదటి పూజను అనాదిగా బోయలే చేయడం ఆనవా యితీగా వస్తోందన్నారు. దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతూ భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు తల్లిగా బోయకొండ అమ్మవారు భక్తులను ఆకర్షిస్తున్నారు. అంతటి మహా చరిత్ర కల్గిన బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ పదవి బోయలకు కేటాయించి అమ్మ వారికి సేవ చేసే భాగ్యం కల్పించాలని అనేక ఏళ్లుగా పాలక ప్రభుత్వాలను కోరుతున్నా స్పందించకపోగా పెత్తందార్లకు కట్టబెడుతూ బోయలను చిన్న చూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోయ సామాజిక వర్గానికి చెందిన గంపల గంగరాజు ఆలయ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని గుర్తు చేశారు. ఆలయ కమిటీ మెంబర్ గంగరాజు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తమ కులానికి చెందిన అన్ని అర్హతలు కలిగిన గంపల గంగరాజును ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమించాలని విన్నవించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాయచోటి

సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం సీజనల్ వ్యాధులపై రాయచోటి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో మలేరియా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ, శానిటేషన్ సెక్రెటరీస్ సిబ్బంది, అర్బన్ పిహెచ్‌సి వైద్య సిబ్బందికి మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, దోమల నివారణపై పూర్తి అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు కూడా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు తప్పకుండా వాడుకోవాలని పేర్కొన్నారు. జ్వరాలు వస్తే వెంటనే ఆ ఏరియాలో లార్వా ఫీవర్స్ సర్వే, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు వై.ప్రసాద్ యాదవ్, ఎన్.జయరామయ్య, మున్సిపల్ అధికారులు మల్లికార్జున, కొండయ్య, వైద్య, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీ నైపుణ్యాన్ని పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రతి విద్యార్థి ఇప్పుడున్న టెక్నాలజీపై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నాస్కామ్ రీజినల్ లీడ్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం అంగళ్ళు సమీపం లోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం వారు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీపై నైపుణ్యాన్ని పెంపొందిచుకోవడంతో పాటు తగిన శిక్షణ తీసుకోవాలన్నారు. ఐటి కంపెనీల్లో స్కిల్స్‌పై ప్రాధాన్యత చూసి నియాకాలు చేపడుతున్నట్లు తెలిపారు. మినిస్ట్రీ అఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి, నాస్కామ్ వారు సంయుక్తంగా ఫ్యూచర్ స్కిల్స్ విత్ ప్రైమ్ అను కార్యక్రమంతో విద్యార్థులలో నైపుణ్యాలను దేశవ్యాప్తంగా పెంపొందించుటకు అవకాశం కలిపిస్తోందన్నారు. ఈ శిక్షణలో సర్టిఫికెట్స్ కూడా విద్యార్థులకు అందజేస్తారని, ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చుక్కెదురు!

ప్రజాదృష్టి

రాష్ట్రంలో తాజాగా కొలువుదీరిన కూటమి సర్కారులో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు చుక్కెదురైంది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏర్పడిన సర్కార్లలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత లభించింది. తాజాగా ఏర్పడిన కూటమి సర్కారులో జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురికావడం గమనార్హం. ఇప్పటి వరకు కడప అసెంబ్లీ స్థానంలో గెలిచిన అభ్యర్థులందరికీ అమాత్యయోగం వరించింది. తాజాగా ఏర్పడిన కూటమి సర్కారులో ఎటువంటి ప్రాధాన్యత లభించకపోవడం టిడిపి శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేసింది. తాజా సార్వత్రిక ఎన్నికల్లో ముగ్గురు సీనియర్ ఎమ్మెల్యేలు, ఇద్దరు కొత్తగా అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పడిన సర్కారులో సీనియర్ ఎమ్మెల్యేలతోపాటు, జూనియర్ ఎమ్మెల్యేలకు ఎటువంటి ప్రాధాన్యత లభించలేదు. సీనియర్ ఎమ్మెల్యేల మధ్య పొసగని రాజకీయ నేపథ్యం వ్యవహారం బెడిసికొట్టింది. ఉమ్మడి కడప జిల్లాను యూనిట్‌గా తీసుకుని అన్నమయ్య జిల్లాలో కొత్తగా అసెంబ్లీకి ఎన్నికైన యువ ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి అమాత్య యోగం వరించింది. టిడిపి నాయకునిగా ఉన్న సమయంలో చోటు చేసుకున్న మదనపల్లి అల్లర్ల కేసులో చురుకుగా స్పందించిన నేపథ్యం మండిపల్లికి అమాత్యపదవి వరించిందనే విశ్లేషణలు ఉన్నాయి. ఉమ్మడి కడప జిల్లా పరిధిలో రాయచోటి ఉండడంతో మంత్రి పదవిని కేటాయించారు. యువ నాయకుడు నారా లోకేష్ ముద్ర ఉండాలనే ఉద్దేశమూ స్పష్టంగా కనిపించింది. కడప జిల్లాకు మంత్రివర్గంలో స్థానం లభించని నేపథ్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు చెందిన టిడిపి శ్రేణుల్లో నిస్తేజం నెలకొంది. 2014-19 టిడిపి హయాంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు కడప జిల్లాలో టిడిపికి ఒక్క స్థానమూ ఇవ్వలేదని పలుమార్లు ప్రస్తావన చేసిన సంగతి తెలిసిందే. తాజా సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లాలో టిడిపిని పెద్దఎత్తున ఆదరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి వర్గంలో ఎటువంటి ప్రాధాన్యత కల్పించకపోవడం గమనార్హం. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ సొంత జిల్లా కావడంతోనే శీతకన్ను వేశారు. రాష్ట్ర మంత్రివర్గ కేటాయింపులో వివక్ష చూపించిన నేపథ్యంలో జిల్లా అభివృద్ధి విషయంలో ఎటువంటి వివక్ష చూపిస్తారోననే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఇటువంటి ఆలోచనకు అవకాశం ఇవ్వడం టిడిపి స్వయం కృతాపరాదమని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


తల్లిబిడ్డ సురక్ష వాహనంలో ఇంటికి వెళుతున్న బాలింతలు

ఎర్రకోటపల్లి పిహెచ్‌సిలో సురక్షిత కాన్పులు

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సురక్ష కాన్పు ద్వారా ఇద్దరు మహిళలు ఆడ ,మగ శిశువులకు జన్మనిచ్చారని వైద్యాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జవహర్‌బాబులు తెలిపారు. కదరాచెరువులోని చెరువుముందరపల్లికి చెందిన జయకృష్ణ భార్య జానకి రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చిందని తెలిపారు. ఇదే గ్రామానికి గణేష్ భార్య ప్రేమలత రెండవ కాన్పులో మగ బిడ్డకు జన్మనిచ్చిందని చెప్పారు. ఇరువురు గర్భిణులకు సురక్షితముగా సాధారణ డెలివరీ చేయించుకున్నారని తెలిపారు. 48 గంటలు వైద్యుల పర్యవేక్షణలో ఉండి అనంతరం సురక్షితముగా ఇల్లు చేరుకున్నారని తెలిపారు. కదిరాయి చెరువు ఆశా కార్యకర్తలు సుజాతకుమారి పిహెచ్‌సిలో కాన్పులు చేయించినారు. డాక్టర్ జవహర్‌బాబు ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులు, ముగ్గురు చాకచక్యంగా సురక్షితంగా కాన్పులు చేశారని తెలిపారు. కార్యక్రమంలో భారతమ్మ. డి.లక్ష్మిదేవి. కవిత పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గాలివీడు పంచాయతీ దానంరెడ్డిగారిపల్లి మండల ప్రాథమిక పాఠశాల నుంచి నల్ల మేకల భరత్ కుమార్‌రెడ్డి, చీపాటి అనిల్ కుమార్‌రెడ్డిలు ముక్కవారిపల్లి గురుకుల పాఠశాలకు ఐదో తరగతి ఎంపికయ్యారు. సింగంరెడ్డిశ్రీ, మూడే మీనాక్షిలు దేవుపట్ల గురుకుల పాఠశాల బాలికలు పాఠశాలకు, అశ్విత అనే విద్యార్థిని ఎర్రగుంట్ల గురుకుల పాఠశాలకు ఎన్నికయ్యారు. మూడే సాత్విక్ నాయక్ అను విద్యార్థి పెద్దమండెం ఎపి మోడల్ స్కూల్‌కు ఎంపికైందనని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొసినేపల్లి ఉపేంద్రకుమార్ పేర్కొన్నారు. గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులను శనివారం పాఠశాలలో తన తోటి ఉపాధ్యాయుడు శ్రీరాములు నాయక్ ఆధ్వర్యంలో వారిని అభినందించారు. మండలంలో ఒక పాఠశాల నుంచే ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపిక కావడంపై ఎంఇఒ పిల్లి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు.


పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్న ఎంఇఒ రామచంద్రారెడ్డి

పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఇఒ రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు కావలసిన పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలకు అందించినట్లు చెప్పారు. ఆరవ తరగతిలో 308సెట్లు, 7వ తరగతికి 370 సెట్లు, 8వ తరగతికి 390సెట్లు, 9వ తరగతికి 46 సెట్లు, 10వ తరగతికి 436 సెట్లు వచ్చినట్లు తెలిపారు. పుస్తకాలను ఆయా పాఠశాలకు పంపిణీ చేశామని తెలిపారు. 10వ తరగతికి భౌతిక శాస్త్రం, 7వ తరగతికి తెలుగు, సాంఘిక శాస్త్రం , హిందీ పాఠ్యపుస్తకాలు రాలేదని అన్నారు. ఉర్దూ పాఠశాలకు ఆరవ తరగతి పాఠ్య పుస్తకాలు అన్ని వచ్చాయని మిగిలిన తరగతులకు పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పి పాల్గొన్నట్లు తెలిపారు. **తంబళ్లపల్లి :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడులు తెలిపారు. మండలంలోని ప్రాథమిక , ప్రాథమి కోన్నత పాఠశాలలకు 20వేల పాఠ్యపుస్తకాలు, 19 వేల నోటుపుస్తకాలు విద్యార్థులకు అందించినట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట


రక్తదానం చేస్తున్న వీరేష్

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సేవలు నిర్విరామంగా కొనసాగుతున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ బెంగుళూరు నగరంలోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి అత్యవసరంగా రక్తం అవసరమైనట్లు సమాచారం రావడంతో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుడు వీరేష్ ఆసుపత్రికి చేరుకుని సదరు చిన్నారికి కావలసిన రక్తాన్ని దానం చేసినట్లు తెలిపారు. రక్తదానం ప్రాణ దానంతో సమానమని అన్నారు. ప్రస్తుతం బెంగళూరు, తంబళ్లపల్లి నియోజకవర్గం కేంద్రాలుగా తమ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని అన్నారు. భవిష్యత్తులో తమ సేవలను మరింత విస్తృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తమ సేవా కార్యక్ర మాలకు సహాయ, సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారులకు చౌకదుకాణాల్లోనే బియ్యం

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా వినియోగదారులు జూన్ నెలకు తీసుకోవలసిన రేషన్‌ను సంబంధిత రేషన్ షాపుల ద్వారా పొందాలని పీలేరు మండల చౌక దుకాణాల సంఘం ప్రధాన కార్యదర్శి పసుపులేటి వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జూన్ నెల రేషన్ సరుకులు ఇప్పటివరకు తీసుకోని వినియోగదారులెవరైనా ఉంటే వారికి పీలేరు పట్టణం, నెహ్రూ బజారులోని 11వ నెంబరు చౌక దుకాణంలో పంపిణీ చేయబడుతుందని అన్నారు. ఈ అవకాశం కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'ముక్కా', ఎమ్మెల్యేలను కలిసిన పోలీసు అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద రెడ్డిని, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను ముక్కావారిపల్లి రూపానందరెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద సిఐ బాబు, కోడూరు ఎస్ఐ నాయక్, పెనుగులూరు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, ఓబులవారిపల్లి ఎస్ఐ చిన్న పెద్దయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే శ్రీధర్‌ను, రూపానందరెడ్డిని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

వైసిపి అక్రమాలను వెలికి తీయండి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను వెలికి తీసి పూర్తి సమాచారం తీసుకురావాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలోని మండల శాఖ అధికారులకు సూచించారు. శనివారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మండలంలో నివాసముంటూ మరో మండలంలో చెరువు, గుట్ట, కాలువ, పొరంబోకు ప్రభుత్వానికి సంబంధిం చిన భూముల్లో ఎలాంటి అనుమతులు ఇళ్లు నిర్మించుకునేందుకు పొజిషన్ సర్టిఫికెట్, ఎన్ఒసి ఎలా ఇస్తారని అధికారులపై మండిపడ్డారు. ఎన్‌టి.రామారావు రైతులన కోసం పీలేరు పరిసర ప్రాంతాల్లో ఆయిల్ మిల్ కోసం భూములు కేటాయిస్తే జగనన్న కాలనీ పేరుతో దర్జాగా ఇంద్ర భవనాలు నిర్మించారన్నారు. వైసిపి నాయకులు పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి తమ కుటుంబ సభ్యులు పనిచేస్తున్నట్లు బిల్లులు చేసుకొని లక్షలాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గ స్థాయిలో మండల శాఖల వారీగా జరిగిన అక్రమాలపై వైసిపి నాయకులు, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తప్పవని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే సర్వే నుంబర్‌పై డికెటి భూములు రిజిస్ట్రేషన్ చేయడం వంటి అక్రమాలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతుంటే చూస్తూ వారికి అన్నివిధాలుగా సహకరించడం సబబు కాదని అన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఎపిఐఐసి, లేఅవుట్‌లో విశ్వ బ్రాహ్మణులకు అనుమతులు లేకుండా ఆరు నుంచి ఏడు ఎకరాల వరకు కట్టబెట్టడం న్యాయమా అంటూ ప్రశ్నించారు. ఆర్అండ్‌బి జాగాల్లో అక్రమ కట్టడాలు మీకు కన్పించడంలేదా అని ప్రశ్నించారు. అధికారులు ఉద్యోగ రీత్యా జవాబు దారీతనం మర్చిపోవడం, వైసిపి నాయకులకు వత్తాసు పలకడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా సహకరించాలని కోరారు.


అధికారులతో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

దూరప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నూలివీడు పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని తలముడిపి కొర్లకుంట నుంచి నూలివీడు ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని శని వారం ఓల్డ్ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు కర్కోటి చంద్రశేఖర్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తలముడిపి కొర్లకుంట పందికుంట, బోరేడుగారిపల్లి, ఈడిగపల్లి నుంచి వచ్చే విద్యార్థుల సంతకాలతో కూడిన లేఖను కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. జడ్‌పి హైస్కూల్‌కు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల నుంచి 30 మంది విద్యార్థులు ఆటోలలో వస్తున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ఆటోలు అందుబాటు ఉండవని అటువంటి పరిస్థితులలో విద్యార్థులు బడికి దూరం కావాల్సి వస్తోందన్నారు. ఆటోలలో అధిక లోడు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పులివెందుల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 5 గంటలకు పాఠశాలకు దగ్గరకు వచ్చే విధంగా, తలముడిపి కొర్లకుంట మీదుగా వెళ్లే విధంగా ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తలముడిపి, కొర్లకుంట, పందికుంట గ్రామాల మధ్య కల్పించాలని కోరుతున్నామని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ట్రెజరర్ నాగార్జునగౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్రం సురక్షితం :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నారా చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టగల సమర్థుడని, ఆయన హయాంలో రాష్ట్రం సురక్షితంగా ఉంటుందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన మరుక్షణమే మెగా డిఎస్‌సి పోస్టులు భర్తీపై మొదటి సంతకం చేయడం హర్షణీయమని అన్నారు. ప్రజల ఆస్తులకు భద్రతలేని గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కూడా రద్దు చేయడం జరిగిందని తెలిపారు. సామాజిక పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెన్స్ వంటి పథకాలపై సంతకాలు చేసి ఎన్‌డిఎ ప్రభుత్వ పాలనకు శ్రీకారం చుట్టడం జరిగిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా సాగుతుందని తెలిపారు.


చమర్తి జగన్మోహన్‌రాజు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం


విద్యార్థినికి అడ్మిషన్ పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కలకడ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెంగల రాయుడు పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం బంగారువాండ్లపల్లి, తిప్పిగారిపల్లి, కోటగుడిబండ గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల తల్లి దండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులు చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, సమవస్త్రాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని తెలిపారు. కంప్యూటర్ ద్వారా విద్యను అందించడంజరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం కలదని తెలిపారు. పాఠశాలలో విశాలమైన ఆట స్థలములో వివిధ క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో అంకితభావం కలిగిన విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి, మహేశ్వరి, నాగమునీ నాయక్, రమేష్ రెడ్డి, గఫార్ ఖాన్, సైరా బాను, నౌషాద్ బేగం, ఝాన్సీ రాణి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బిసిజి టీకాతో క్షయ దూరం : డాక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసిజి టీకాతో క్షయ దూరమవుతుందని బిసిజి టీకాలు అందరికీ వేయాలని డివిజినల్ టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం బి.కొత్తకోట సామజిక ఆరోగ్య కేంద్రం, పెద్దతిప్పసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబదించిన ఆరోగ్య కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రోవైడర్‌లను ఉద్దేశించి డాక్టర్ శ్రీధర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దల బిసిజి కార్యక్రమం జిల్లాలో 2025 నాటికి టిబి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బిసిజి టీకా కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే ఈ టీకా ఎంతో సురక్షితమని, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. కొత్తకోట పట్టణంలో బిసి కాలనీ, ఎస్‌సి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఆలేటిపల్లి సచివాలయము పరిధిలో టిబి యూనిట్ సిబ్బంది తనిఖీ చేశారు. 18 ఏళ్ళపై బడి దేళ్లలోపు లోపు క్షయ కోరుకు మందులు మింగి టిబి వ్యాధి నయం అయిన వారికి, క్షయవ్యాధిగ్రస్థుల కుటుంబసభ్యులకు, మధుమేహ వ్యాధిగ్రస్థులకు, ధూమపానం సేవించే వారికి, 60 సంవత్సరాలు పై బడిన వారికి బిసిజి టీకాను అన్ని సచివాలయంలలో ప్రతి సోమ, గురువారం మూడు నెలలు పాటు ఆరోగ్యసిబ్బందిచే పంపిణీ చేయబడుతుందని తెలిపారు. టిబి ఛాంపియన్‌లు సమన్వయ పరుచుకొని టీకా కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌సి డాక్టర్ కిరణ్ , డాక్టర్ ఎస్దాని, సబ్ యూనిట్ ఆఫీసర్ ఖలీశ్ , సూపర్ వైజర్‌లు విజయ కుమారి, రెడ్డెప్ప, మదనపల్లె టిబి విభాగం సిబ్బంది ప్రభాకర్, శాంతి, సుశీల, వన జకుమారి, సునీత, లాబ్ టెక్నిషియన్ రియాజ్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


బిసిజి టీకాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అనితకు హోంమంత్రి పదవిపై హర్షం


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-ములకలచెరువు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది హోంశాఖమంత్రిగా పదవి స్వీకరించిన వంగలపూడి అనిత పదవిపై మాదిగలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రివర్గంలో ఒక ఎస్‌సి మాదిగ ఎమ్మెల్యేకు అత్యుత్తమ స్థాయి పదవి దక్కడంతో పాతములకలచెరువు గ్రామంలో ఎంఆర్‌పిఎస్ నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా టిడిపికి ఎంఆర్‌పిఎస్ పూర్తిస్థాయిలో మద్దతునిచ్చి మాదిగల ఓట్లు ఎన్‌డిఎ కూటమికి వేసినట్లు తెలిపారు. మాదిగలు చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాదిగ బిడ్డకు రాష్ట్రస్థాయి మంత్రివర్గ విస్తరణలో హోం మంత్రి పదవిని కట్టబెట్టి మాదిగల పట్ల విశ్వసనీయతను చాటుకున్నారని అన్నారు. ఎమ్మార్పీఎస్ తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాజంపేట కార్యనిర్వాహక కార్యదర్శి గంగాదేవి, ప్రసాద్, లక్ష్మన్న, ఆదెప్ప, జనసేన నాయకుడు కోటప్ప, విష్ణు గంగాధర, అశోక్, నాగరాజ్, టీ కోటప్ప, శివన్న మహిళలు రమణమ్మ,నరసమ్మ, లక్ష్మీదేవి, అనసూయమ్మ ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాసరావు నియామకం అభినందనీయం

ప్రజాశక్తి-రామసముద్రం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పల్లా శ్రీనివాసరావును ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం అభినందనీయమని మండల టిడిపి మండల అధ్యక్షులు విజయ్‌కుమార్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిలో బిసిలకు పెద్దపీట వేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌పై భారీ మెజార్టీతో పల్లా శ్రీనివాసరావు గెలుపొందారని అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా 95,235 ఓట్ల తేడాతో పల్లా గెలుపొందడం హర్షణీమన్నారు. బిసి యాదవ వర్గానికి చెందిన పల్లాను చంద్రబాబు ఎంపిక చేయడం అభినందనీయని అన్నారు. అధిష్టానం బిసి వర్గానికి చెందిన నాయకుడు పల్లా శ్రీనివాసరావును నియమించడంతో టీడీపీ కేడర్ అభినందనలు తెలిపారు.


ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యేను సన్మానించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కలకడ


పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డిని మండల టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన టిడిపి కార్యకర్తలు, అభిమానులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అభిమానులు ఎమ్మెల్యేని కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు మండల ప్రజా ప్రతినిధులు, ప్రజాశక్తి విలేఖరి రఘునాథ తదితరులు ఎమ్మెల్యే ని కలిసి బొకేలు శాలువాలతో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు ఎన్‌పి నాగన్న, ఎస్‌వి.రమణ, కళా వెంకటరమణ (భీముడు) పాల్గొన్నారు.


విద్యార్థికి పుస్తకాలను అందిస్తున్న డిఇఒ

నాణ్యమైన విద్యను అందించాలి : డిఇఒ

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు పట్టికను పరిశీలించారని పేర్కొన్నారు. అనంతరం డిఇఒ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్ పంపిణీ చేశారు. పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 10 వ తరగతి ఫలితాలు 92శాతం, 576 అత్యధిక మార్కులు సాధించినందుకు సంతృప్తి వ్యక్తం చేసి ప్రధానోపా ధ్యాయురాలు సరస్వతిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి

వైభవంగా చండీ హోమం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీమారమ్మతల్లి ఆలయంలో పొంగళ్ళ మహోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం గ్రామ పురోహితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకుల తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రడెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ఈయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువా పూలమాలతో సత్కరించారు. ఛండీ హోమానికి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కలను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తలు శింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గాప్రసాద్ రెడ్డి, గొబ్బిళ్ళ త్రినాథ్, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, ఆనాల మధు యాదవ్, పెనుబాల నాగసుబ్బయ్య, గుండు గోపాల్‌రెడ్డి, దుర్గారెడ్డి, ఆకేపాటి రమేష్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మోష, వార్డ్ మెంబర్ దుర్గయ్య పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయం ప్రాంగణంలో శనివారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు , మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ పెంపుపై సంతకం చేయడం అవ్వ తాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి తెదేపా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మందకృష్ణ మాదిగ తమ ముఖ్యమంత్రి అడుగుజాడల్లో నడిచి టిడిపి గెలుపునకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీను గౌడ్, సర్పంచ్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకటప్ప, శివ,దినేష్, జావిద్ బాషా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ప్రజాశక్తి-కలికిరి

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని బోడుమల్లువారిపల్లి గ్రామం, మేకలవాని కాలువ కు చెందిన ముక్త మురళి(42) కలికిరిలోని బీడీ కాలనీకి చెందిన వీరభద్రయ్య నూతన నిర్మించుకున్న ఇంటికి పెయింట్ వేసే పనికి ఒప్పుకున్నట్లు తెలిపారు. ముక్త మురళితో పాటు మరికొంత మంది పెయింటింగ్ పని చేసుకుంటూ ఉండగా శని వారం సాయంత్రం మురళి పెయింట్ రోల్లర్‌బ్రష్‌కు ఒక పొడవాటి ఇనుప పైప్ తగిలించుకొని ఇంటి ముందర ఒక కిటకీ లోనుంచి బయటగోడకు వైపు పెయింట్ కొడుతుండగా ఇంటి ముందు ఉన్న 33కెవి లైన్ విద్యుత్ వైర్‌కు ప్రమాదవశాత్తు ఇనుప పైప్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురైనట్లు తెలిపారు. మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయాడని చెప్పారు. శరీరం అంతటా కాలిపోయిందని, తలకు బలమైన రక్త గాయాలు అయినట్లు తెలిపారు. అక్కడ పనిచేసే తొటి పెయింటర్లు, ఇంటి యజమాని వీరభద్రయ్య కలిసి మురళిని చికిత్స కోసం కలికిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటనపై ఎఎస్ఐ మాబుసాహెబ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.